క్లుప్తంగా

తిరుచ్చిపై అమ్మవారి విహారం



తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం ఊంజల్ సేవ చేపట్టారు. అనంతరం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో విహరించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ దేవరాజులు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు సుభాస్కర్ నాయుడు, చలపతి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

గద్దర్‌పై విమర్శలు తగదు



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : ప్రజా గాయకుడు గద్దర్‌ను విమర్శించడం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు తగదని సీపీఐ రాష్ట్ర నేత రామా నాయుడు, ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మండిపడ్డారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ సమ సమాజం నిరంతరం శ్రమించిన గొప్ప విప్లవకారుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో నేతలు రాధాకృష్ణ, విశ్వనాథ్, నాగరాజు, గురవయ్య పాల్గొన్నారు.

టీటీడీ ఈఓ ఆకస్మిక తనిఖీలు

తిరుమల : టీటీడీ ఈఓ జె. శ్యామలరావు శుక్రవారం గాలిగోపురం, 7వ మైలు వద్ద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గాలి గోపురం వద్ద వైద్యులు, మందుల లభ్యతను పరిశీలించారు. 7వ మైలు వద్ద తినుబండారాల షాపుల సమీపంలోని ప్రాంగణాల శుభ్రతను తనిఖీ చేశారు.

ఉద్యోగి కోసం ముమ్మర గాలింపు

మహా కుంభమేళాలో అదృశ్యమైన టీటీడీ ఉద్యోగి దీపాలి సుబ్రమణ్యం కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని ఈఓ వెల్లడించారు. యూపీ పోలీసుల సహకారంతో విజిలెన్స్ బృందం గాలింపు చేపట్టిందని, త్వరలోనే ఆచూకీ గుర్తిస్తామని వివరించారు.

ఆర్యవైశ్యుల సంక్షేమమే లక్ష్యం



సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి కల్చరల్ : ఆర్యవైశ్యుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. శుక్రవారం కొత్త వీధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఎమ్మెల్యే తన సతీమణితో కలిసి సారె సమర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఆర్యవైశ్యులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పామిడి సత్యనారాయణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, శిరీష, మంజునాథ్, హేమచంద్రకుమార్, వెంకటేష్ గుప్తా పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లతో భారీగా ఆదాయం సమూర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇష్టారాజ్యంగా ప్రజలను బాదేస్తోంది. అందులో భాగంగా భూముల రేట్లను విపరీతంగా పెంచేసింది. గజం స్థలంపై దాదాపు రూ.8వేల వరకు భారం మోపుతోంది. దీంతో. తిరుపతితోపాటు పట్టణ ప్రాంతాలకు సమీపంలోని భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. నేటి రిజిస్ట్రేషన్ రేట్లు రెట్టింపు కానున్నాయి.





రిజిస్ట్రేషన్ల భారం

- గజం స్థలంపై రూ.8 వేల వరకు పెంపు
- ఆస్తుల క్రయవిక్రయదారులు ఆందోళన
- నేటి నుంచి కొత్త ధరల ప్రకారమే రిజిస్ట్రేషన్లు
- తిరుపతి నగరంతోపాటు మున్సిపాలిటీల్లో పెరిగిన ధరలు
- రియల్ ఎస్టేట్‌పై తీవ్ర ప్రభావం

తిరుపతి అర్బన్: మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను కూటమి ప్రభుత్వం కల్లలు చేస్తోంది. భూముల ధరలు పెంచిన నేపథ్యంలో స్థిరాస్తి రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. మునుపెన్నడూ లేని విధంగా అత్యధిక శాతం రిజిస్ట్రేషన్ చార్జీలను తిరుపతి నగరంతోపాటు పట్టణ ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లోను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం నుంచి భూముల రిజిస్ట్రేషన్ల పరంగా పేదలు, సామాన్య ప్రజలకు అదనపు భారం పడనుంది. కొత్త ధరలతో జిల్లా నుంచి ప్రతి త్రైమాసికానికి రూ.150 కోట్ల మేరకు ఆదాయం రాబట్టాలని జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో జిల్లాల పునర్విభజనలో భాగంగా తిరుపతిని జిల్లా కేంద్రంగా మార్పు చేయడంతో రియల్ ఎస్టేట్ ఒక్కసారిగా భారీగానే పుంజుకుంది. జిల్లా కేంద్రంలో తమకు ఒక ప్లాట్ ఉండాలని పలువురు భావించారు. దీంతో ప్లాట్ల రేట్లు పెరగడంతో స్థిరాస్తి రంగం ఊపందుకుంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీరుతో రియల్ ఎస్టేట్ రంగ వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.



కిక్కిరిసిన చంద్రగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

రిజిస్ట్రేషన్లే ఆదాయ వనరు!

జిల్లాలో తిరుపతి శివారు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా భూముల విలువలను పెంచేశారు. ఒక గజం భూమిపై ఏకంగా రూ.8వేలు పెంచిచగా, 100 గజాల భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.8లక్షల వరకు ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

మొరాయించిన సర్వర్లు

చంద్రగిరి/పాకాల : రిజిస్ట్రేషన్ చార్జీలు శనివారం నుంచి పెరగనున్న నేపథ్యంలో శుక్రవారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో క్రయ, విక్రయ రిజిస్ట్రేషన్లు జోరుగా సాగాయి. పెద్దసంఖ్యలో జనం తరలిరావడంతో కార్యాలయాలు కిక్కిరిసాయి. ఈ క్రమంలోనే సర్వర్లు మొరాయించడంతో రిజిస్ట్రేషన్లకు ఇబ్బంది తప్పలేదు.

తిరుపతిలో	రెసిడెన్షియల్ ప్లాట్స్ గజం ధర		కమర్షియల్ ప్లాట్స్ గజం ధరలు	
	పాత ధరలు	కొత్త ధరలు	పాత ధరలు	కొత్త ధరలు
కరకంబాడి	30వేలు	36వేలు	39వేలు	47 వేలు
ఆటో నగర్	21వేలు	26 వేలు	37 వేలు	45 వేలు
కృష్ణానగర్	21వేలు	26వేలు	37 వేలు	45 వేలు
రేణిగుంటరోడ్డు	29వేలు	35వేలు	37వేలు	45 వేలు
గొల్లవానిగుంట	23వేలు	28వేలు	37వేలు	45వేలు
రవీంద్రనగర్	15వేలు	18 వేలు	37వేలు	45 వేలు
కొంకెన్నయ్యగుంట	17వేలు	21వేలు	37వేలు	45 వేలు
విజయపురం	19వేలు	23 వేలు	21 వేలు	26 వేలు
జ్యోతి కాలనీ	7వేలు	21 వేలు	18వేలు	22 వేలు
మాధవ నగర్	17వేలు	21 వేలు	18వేలు	22 వేలు
గోవింద నగర్	16వేలు	20వేలు	17వేలు	21 వేలు
సత్యనారాయణపురం	20వేలు	24 వేలు	21వేలు	26వేలు
ఎస్ఎన్‌పురం	20వేలు	24 వేలు	21వేలు	26వేలు
చంద్రబాబుకాలనీ	17వేలు	21 వేలు	21వేలు	26 వేలు
ఎర్రమిట్ట	20వేలు	24వేలు	21 వేలు	26 వేలు
శ్రీరామనగర్	19వేలు	23 వేలు	39వేలు	47వేలు

1 నుంచి కొత్త ధరల ప్రకారమే రిజిస్ట్రేషన్లు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 1 నుంచి భూముల నూతన ధరల ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేస్తాం. ఆ మేరకు జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఇప్పటికే అనుమానాలు నివృత్తి చేయడంతోపాటు ఉద్యోగులకు అవగాహన కల్పించాం. సిస్టమ్‌లోనూ ఫీడ్ చేస్తున్నాం. పాత ధరల శుక్రవారం మాత్రమే రిజిస్ట్రేషన్లు ఉంటాయి.

–శ్రీరామ్‌కుమార్, జిల్లా రిజిస్ట్రార్, తిరుపతి

నాణ్యమైన విద్య కోసమే క్లస్టర్ విధానం

– విద్యార్థులకు రవాణా చార్జీలు ఇస్తాం

తిరుపతి అర్బన్ : నాణ్యమైన విద్యను పిల్లలకు అందించడానికే క్లస్టర్ విధానాన్ని అమలు చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం కలెక్టరేట్‌లో డీఈవో కేవీఎస్ కుమార్‌తో కలిసి ఎంపీఈవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 130 క్లస్టర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో 5 నుంచి 10 పాఠశాలలు ఉంటాయని వెల్లడించారు. విద్యార్థుల సంఖ్యను బట్టి వసతులు కల్పిస్తామన్నారు. 60 మందికి పైగా విద్యార్థులు ఉంటే మోడల్ స్కూల్‌గా చేస్తామని తెలిపారు. 60 మంది కన్నా తక్కువ మంది ఉంటే బేసిక్ ఫౌండేషన్ పాఠశాలగా మారుస్తామన్నారు. 5 కిలోమీటర్లు ప్రయాణించే విద్యార్థులకు రవాణా చార్జీలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

పాకాల : సీపీఎం మహాసభల పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సీపీఎం కార్యదర్శి మధుసూదన్ రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు నిరసనగా నెల్లూరులో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం నుంచి 3వ తేదీ వరకు జరిగే సభలను విజయవంతం చేయాలని కోరారు. నేతలు ప్రసాద్, నరేంద్ర, రవి, దేవేంద్ర, హరిబాబు, గజేంద్ర, నూరు, గిరి, వినాయక పాల్గొన్నారు.

విద్యార్థినులకు అభినందన

తిరుపతి సిటీ : గణతంత్రదినోత్సవంలో ప్రతిభ చూపి కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఎన్‌సీసీ విద్యార్థినులను పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నారాయణమ్మ అభినందించారు. శుక్రవారం ఈ మేరకు విద్యార్థినులు కావ్య, సరస్వతి, సాయిగోపిక, కులదీపికను ప్రశంసించారు. కార్యక్రమంలో సీటీఓ సీహెచ్ సుహాసిని, డాక్టర్ ఉమారాణి, డాక్టర్ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



విద్యార్థినులతో అధ్యాపకులు

దుకాణాల వేలం వాయిదా

చంద్రగిరి : పంచాయతీ కాంప్లెక్స్ దుకాణాల వేలం పాటను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సర్పంచ్ ముదికుప్పం రూపారామ్మూర్తి, సెక్రటరీ మహేశ్వరయ్య తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ మార్కింగ్ పూర్తయిన తర్వాత వేలం నిర్వహించాలని పాటదారులు కోరినందున ఈ మేరకు నిర్ణయించినట్లు వెల్లడించారు. త్వరలోనే మరో తేదీని ప్రకటించనున్నట్లు వివరించారు.

పక్కాగా నాణ్యమైన ఆహారం

తిరుపతి తుడా : నగరంలోని అన్నా క్యాంటీన్లలో పక్కాగా నాణ్యమైన ఆహారం అందించాలని కార్పొరేషనర్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలోని అన్నా క్యాంటీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజూ ఎంతమంది వస్తున్నారు... ఎన్ని టోకెన్లు ఇస్తున్నారు.. ఆహార పదార్థాలు సకాలంలో వస్తున్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సచివాలయం సిబ్బంది నిత్యం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.



క్యాంటీన్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ మౌర్య

సౌకర్యాలు కల్పించాలి

తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు లేఔట్లలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని తుడా ఉపాధ్యక్షులు, కమిషనర్ మౌర్య ఆదేశించారు. తుడా ఆధ్వర్యంలో సూరప్పకశం, నగరి వద్ద ఏర్పాటు చేసిన లేఔట్లను, నగరి, రేణిగుంటలలోని పార్కులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పార్కులను సుందరీకరణ చేయాలన్నారు. రేణిగుంటలోని పార్కు సుందరీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్ఈ కృష్ణారెడ్డి, సీపీఓ దేవికుమారి, డీఈ బాషా, ఉద్యానవన శాఖ అధికారి మాలతి, సర్వేయర్ దేవానంద్ పాల్గొన్నారు.

చెత్తను వేర్వేరుగా సేకరించండి

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని గృహాల వద్ద, వాణిజ్య సముదాయాల్లోను ప్రతి రోజూ తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. 33 వ వార్డు స్కావెంజర్స్ కాలనీ, రైల్వే కాలనీ, తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ దూది కుమారి, హెల్త్, ఇంజినీరింగ్, ప్లానింగ్ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు.

ఉద్యోగ విరమణ సత్కారం

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్ ప్రోటోకాల్ విభాగం తహసీల్దార్ కుప్పయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో కుప్పయ్య దంపతులను కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్ఓ నరసింహులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు.



తహసీల్దార్ కుప్పయ్యను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీ

చంద్రగిరి : పనపాకం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం రెడ్డిని ఉద్యోగ విరమణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ మాజీ చైర్మన్ చెంగ్రాయులు, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, ఎంఈఓ భాస్కర్ బాబు, చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి, దుర్గసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం రాజు, రిటైర్డ్ హెచ్‌ఎం అరిగిల రామచంద్రయ్య, ఇన్‌చార్జి హెచ్‌ఎం పట్టాభి పాల్గొన్నారు.

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగిగా 34ఏళ్ల పాటు సేవలందించిన ఎస్.ధనమ్మను ఘనంగా సత్కరించారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు మాట్లాడుతూ ధనమ్మ తన శేషజీవితం సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాత్రేస్వరి, రమేష్ , ప్రభు దాస్, గిరిప్రసాద్, ప్రకాష్ పాల్గొన్నారు.



పురుషోత్తం రెడ్డిని సత్కరిస్తున్న చెంగల్రాయులు



ధనమ్మను సత్కరిస్తున్న రుయా అధికారులు

ట్రాన్స్‌జెండర్ల హక్కులపై అవగాహన

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ట్రాన్స్ జెండర్స్ హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు నూతన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. డీన్ ప్రొఫెసర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ అముదవల్లీ, డాక్టర్ నీరజ, డాక్టర్ జనార్దన్‌రాజు పాల్గొన్నారు.

సేఫ్ డ్రైవింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా పద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులకు సేఫ్ డ్రైవింగ్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ప్రొఫెసర్ ఎం.విద్యావతి, డాక్టర్ ఆర్.భారతి ఈ సందర్భంగా సురక్షిత డ్రైవింగ్‌లో మెలకువలు, ట్రాఫిక్ నిబంధనలు, అజాగ్రత్త కారణంగా తలెత్తే అనర్థాలు, హెల్మెట్ వాడకం, సీటు బెల్ట్ వినియోగం తదితరాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ బిందు, డాక్టర్ శాంతిశ్రీ, డాక్టర్ ఏఎం బ్యూలా పాల్గొన్నారు

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల : తిరుమల శ్రీవారిని శుక్రవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, సినీ నటుడు విష్వక్సేన్, సినీ నిర్మాత చెరుకూరి సుధాకర్, ఉత్తరాది మఠం పీఠాధిపతి సత్యాత్మ తీర్థ స్వామీజీ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం ఇవ్వగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారి ఆలయం వెలుపల సినీ నటుడు విష్వక్సేన్

'హీరో డెస్టినీ-125' ఆవిష్కరణ



కస్టమర్‌కు స్కూటర్ అందిస్తున్న షోరూమ్ అధినేతలు

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని పృథ్వీ షోరూమ్‌లో శుక్రవారం సరికొత్త హీరో డెస్టినీ-125 స్కూటర్‌ను ఆవిష్కరించారు. షోరూమ్ అధినేత పి.మోహన్‌రెడ్డి, జి.పృథ్వీరెడ్డి, ఎస్‌బీఐ ఏజీఎం సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక టెక్నాలజీతో ఐకానిక్ రెట్రో డిజైన్‌తో ఇల్యూమినేటెడ్ స్టార్ట్ స్విచ్, ఫుల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్ హెడ్ ల్యాంప్ విత్ బ్లూటూత్ సౌలభ్యం ఉందని తెలిపారు. ఐదు కలర్స్‌లో మూడు మోడల్స్‌లో ఈ కొత్త వాహనం అందుబాటులో ఉందన్నారు. ఈ వాహనం షోరూం ధర రూ.92,800లని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ నాగరాజు, షోరూమ్ మేనేజర్ బిందు పాల్గొన్నారు.

తుమ్మలగుంటలో రథసప్తమి ఏర్పాట్లు

తిరుపతి రూరల్ : తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహించనున్న రథసప్తమి వేడుకలకు శుక్రవారం ఏర్పాట్లు ప్రారంభించారు. స్వామివారు ఊరేగే వాహనాలు, గర్భాలయంతోపాటు పరివార దేవతా మూర్తుల ఆలయాలు, వాహన మండపాలను శుద్ధి చేశారు. భక్తుల తాకిడి పెరిగే అవకాశం ఉన్నందున అందుకు తగినట్లుగా సర్వం సిద్ధం చేస్తున్నారు.

బెదిరింపులపై ఆవేదన



మాట్లాడుతున్న బాధితుడు యోగానంద్

తిరుపతి కల్చరల్ : తమ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటూ ఉంటే అడ్డుకుంటూ డబ్బులు ఇవ్వాలని కొందరు బెదిరిస్తున్నారని శ్రీకాళహస్తికి చెందిన బాధితుడు యోగానంద్ ఆవేదన వ్యక్తం చేశారు.. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పత్రికా విలేకరులమంటూ (సాక్షి కాదు) ఇద్దరు వ్యక్తులు తమ వద్దకు వచ్చి తమకు రూ.50 వేలు ముట్టజెప్పకుంటే ఇల్లు కట్టనీయమని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని వాపోయారు. దీనిపై ఎమ్మెల్యే, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. బాధితుడి తల్లి సంజీవమ్మ, సోదరుడు పూర్ణేష్ పాల్గొన్నారు.

విప్ భయం.. పదవీ గండం!

తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఫిరాయింపుదారులకు భయం పట్టుకుంది. వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేయడంతో ధిక్కరిస్తే పదవీ గండం తప్పదని గోడ దూకిన కార్పొరేటర్లతో ఆందోళన మొదలైంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో పార్టీకి ద్రోహం చేసి రాజకీయ స్వార్థంతో కూటమి పంచన చేరిన వారి భవిత్యం ప్రశ్నార్థకం కానుంది.

- 3 న డిప్యూటీ మేయర్ ఎన్నిక
- ఫిరాయింపుదారుల్లో ఆందోళన



కార్పొరేషన్ కార్యాలయం

తిరుపతి తుడా : నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ మొదలైంది. ఈ నెల 3వ తేదీన 11 గంటలకు డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకోనున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరించనున్నారు. డిప్యూటీ మేయర్ స్థానాన్ని దక్కించుకునేందుకు వైఎస్సార్‌సీపీ సంపూర్ణమైన బలంతో ఉండగా.. టీడీపీ తరఫున గెలిచిన ఒకే ఒక్క కార్పొరేటర్‌తో పాటు ఫిరాయింపుదారులపై ఆధారపడింది. అధికారం అండగా నయానో భయానో.. అడ్డదారిలో డిప్యూటీ మేయర్‌ను ఎలాగైనా దక్కించుకోవాలని కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు. తిరుపతి నగర పాలక సంస్థలో 50 డివిజన్లు కాగా 49 ఎన్నికలు జరిగాయి. ఇందులో 48 డివిజన్లను వైఎస్సార్‌సీపీ దక్కించుకుంది. ఇందులో24 డివిజన్ కార్పొరేటర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడంతో 4వ డివిజన్ కార్పొరేటర్ భూమన అభినయ్‌రెడ్డి రాజీనామా చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల సంఖ్య 46 చేరింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఐదుగురు కార్పొరేటర్లు ప్రలోభాలకు లోనై కూటమిలోకి ఫిరాయించారు. తర్వాత మరో నలుగురు కార్పొరేటర్లు గోడ దూకేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ బలం 37 తగ్గినా, డిప్యూటీ మేయర్ ఎన్నికు కావాల్సిన పూర్తి మెజారిటీ ఉంది. ఈ క్రమంలోనే ఫిరాయింపుదారుల్లో ఇద్దరు కార్పొరేటర్లు తిరిగి సొంత గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నారు.

ధిక్కరిస్తే వేటు తప్పదు

డిప్యూటీ మేయర్‌ను దక్కించుకునేందుకు పూర్తి మెజార్టీ ఉండటంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ధీమాగా ఉన్నారు. నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయ కర్త భూమన అభినయ్‌రెడ్డి,, మేయర్ డాక్టర్ శిరీష రంగంలోకి దిగి కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా బరిలో దింపారు. ఈ ఎన్నికకు పార్టీ విప్‌గా 1వ డివిజన్ కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణారెడ్డిని నియమించారు. ఈ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ విప్ జారీ చేయనుండటంతో ఫిరాయింపుదారులు ఆందోళన చెందుతున్నారు. విప్‌ను దిక్కరిస్తే అనర్హత వేటు తప్పదనే భయం వారికి పట్టుకుంది. విప్ జారీ చేసిన వెంటనే కౌన్సిల్ హాల్‌లో పార్టీల వారీగా కార్పొరేటర్లు కూర్చోవాల్సి ఉంటుంది. దీంతో వైఎస్సార్‌సీపీ గుర్తుపై గెలిచిన 46 కార్పొరేటర్లు ఒక పక్కన, టీడీపీ నుంచి గెలిచిన ఒక్క కార్పొరేటర్ ఒంటరిగా మరో పక్క ఆశీనులు కావాలి. ఈ మేరకు విప్ అతిక్రమించేవారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఇప్పటికే న్యాయనిపుణులను సంప్రదించింది.

అవహేళన అవసరమా..?

కార్పొరేటర్ల పదవీ కాలం ఇక 13 నెలలు మాత్రమే ఉన్నందున అనర్హత వేటు వేయించుకుని అవహేళన పాలు కావడం అవసరమా అని ఫిరాయింపు కార్పొరేటర్లలో ఆలోచనలు మొదలైనట్లు తెలిసింది. కేవలం ఏడాది పదవి కోసం అవమానాలు కొని తెచ్చుకోవడం ఎందుకని భావిస్తున్నట్లు సమాచారం. తర్వాత జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి పార్టీలు తమకు టికెట్ కేటాయించే అవకాశాలు లేవని, ఆ మాత్రం దానికి విప్ ధిక్కరించి ఉన్నతి ఊడగొట్టుకోవడం ఎందుకని అనుకుంటున్నట్లు తెలుస్తోంది.